# సాక్షి జగిత్యాల

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024






## చేపల పెంపకం.. ఉపాధి నమ్మకం

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్‌మానేరులో చేపలు పెంచుతూ అక్కడి నిర్వాసిత ప్రజలు ఉపాధి పొందుతున్నారు. 8లో▸



## ఆకట్టుకున్న ప్రదర్శనలు

రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0/18.0

## వాతావరణం

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది. చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### వ్యవసాయ వర్సిటీ భూములు వెనక్కి ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న వ్యవసాయ విద్యార్థులు

**జగిత్యాలరూరల్:** హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న వ్యవసాయ ఉద్యానవన యూనివర్సిటీ భూములు హైకోర్టుకు కేటాయించకుండా జీవో నంబరు 55ను వెంటనే రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మన్వాడ నందు డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాల వద్ద పాలిటెక్నిక్, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ.. వ్యవసాయ ఉద్యానవన యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దని సూచించారు. యూనివర్సిటీలో 35ఏళ్లుగా మెడిసిన్ ప్లాంట్స్, వెజిటేబుల్ సీడ్స్, ఫారెస్ట్రీ మొదలైన వాటిపై ఎన్నో రకాల పరిశోధనలు చేస్తున్నారన్నారు. నేడు బయోడైవర్సిటీ కొనసాగుతున్న పార్క్‌లో రాష్ట్ర హైకోర్టుకు సంబంధించిన భవనాలు కట్టేందుకు జీవో నంబరు 55 తీసుకువచ్చారన్నారు. యూనివర్సిటీలో దాదాపు 100ఎకరాల భూమిని తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ ఆలోచనను విరమించుకోవాలన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు రఘు

**మల్లాపూర్:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌చార్జి డాక్టర్ చిట్నేని రఘు పిలుపునిచ్చారు. మల్లాపూర్‌లో శుక్రవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేళ్లుగా దేశం అన్ని రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరాయని వివరించారు. గావ్ చలో- బస్తీచలో అభియాన్ కార్యక్రమంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు వెళ్లి కేంద్ర పథకాలు, ఇచ్చే నిధులను వివరించాలని తెలిపారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గుయ్యా శ్రీశైల మల్లేశ్‌యాదవ్, ముత్యాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### సమ్మె జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

**జగిత్యాల:** ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీఆర్ఎస్‌కేవీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. హాజరైన ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వివరించేందుకే సమ్మె నిర్వహించడం జరుగుతుందని, ప్రతీ ఒక్కరు పాల్గొనాలన్నారు. నా యకులు సుతారి రాములు, ముక్రం, చౌదరి, భీమయ్య, స్వాతి, కరుణాకర్, మియాజోద్దీన్ పాల్గొన్నారు.

### సమ్మె నోటీసు అందజేత

**జగిత్యాలరూరల్:** గ్రామపంచాయతీ కార్మికుల సమస్య పరిష్కరించాలని ఫిబ్రవరి 16న సమ్మె ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు పులి మల్లేశంగౌడ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోమటి చంద్రశేఖర్, పోచయ్య, నవీన్, వంగ రాజేశం, గంగయ్య, చిల్ముల రాజయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

### స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు పొడిగింపు

**జగిత్యాల:** 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తులకు గడువు తేదీ పొడిగించినట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 31 వరకు గడువు పొడిగించడం జరిగిందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# పైసలిస్తేనే సర్టిఫికెట్!

- జనన, మరణ ధ్రువపత్రాల జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం
- మామూళ్లు అందితేనే ఫైల్ ముందుకు..?
- జగిత్యాల ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి

**జగిత్యాల:** మనిషి పుట్టినా.. మరణించినా అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం ప్రస్తుత రోజుల్లో తప్పనిసరి. అయితే ఆ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో తీవ్రజాప్యం చేస్తున్నారు జగిత్యాల ఆస్పత్రి అధికారులు. ఆస్పత్రిలో పుట్టిన శిశువు, మరణించినవారి వివరాలు మున్సిపాలిటీకి పంపించడంలో ఆలస్యం చేస్తున్నారు. డబ్బులిచ్చే వారిఫైళ్లు మున్సిపాలిటీకి పంపిస్తూ.. ఇవ్వనివారి ఫైళ్లు సిబ్బంది లేరనే సాకుతో నెలలు గడిచినా ముందుకు కదపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సర్టిఫికెట్ల జారీలో తీవ్రజాప్యం జరిగి.. జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**సర్టిఫికెట్లు ముఖ్యం**

ప్రస్తుతం ప్రతీపనికి డెత్ సర్టిఫికెట్ అయినా, బర్త్ సర్టిఫికెట్ అయినా ఎంతో అవసరం. ఇన్సూరెన్స్, పెన్షన్, ఆధార్‌కార్డు, బీమా.. ఇలా దేనికైనా సర్టిఫికెట్లు కావాల్సిందే. ప్రజల అవసరాన్ని అవకాశంగా తీసుకుంటున్న ఆస్పత్రి సిబ్బంది కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రితో పాటు, ప్రైవేటు ఆస్పత్రిలో డెత్, బర్త్‌లకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరంగా మున్సిపాలిటీకి పంపించాల్సి ఉంటుంది. కానీ జగిత్యాల ఆస్పత్రినుంచి 2023 ఫిబ్రవరి నెల వరకే డెత్ సర్టిఫికెట్ల రికార్డులు మున్సిపాలిటీకి పంపించగా, జనన సర్టిఫికెట్ల రికార్డులు గతేడాది 10వ నెలవరకు పంపించారు. జిల్లా ఆస్పత్రికి చెందిన కొందరు సిబ్బంది కావాలనే పెండింగ్‌లో ఉంచుతూ మామూళ్ల కోసం ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపణలు కొకొల్లలు.

**ఆమ్యామ్యాలు అందితేనే**

డెత్, బర్త్ సర్టిఫికెట్లు ఎవరికైనా అవసరం ఉంటే ఆమ్యామ్యాలు అందితే వెంటనే రికార్డులు ఆస్పత్రి నుంచి మున్సిపల్‌కు వెళ్తాయనే ఆరోపణలున్నాయి. లేకుంటే ఎన్ని రోజులు అయినా ఫైల్ పెండింగ్‌లోనే ఉంటున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆస్పత్రికి, మున్సిపాలిటీకి తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఎవరైనా సర్టిఫికెట్‌కోసం వెళ్తే మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని ఓసారి, ఫాం–2, ఫాం–4 కొనుక్కోవాలని మరోసారి, ఫైల్‌కు సంబంధించిన జిరాక్స్‌లు తేవాలని తిప్పుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో సిబ్బంది లేరనే సాకుతో నెలరోజులకు ఒకసారి రికార్డులను మున్సిపల్ కార్యాలయానికి పంపిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

**పెండింగ్‌లో అనేకం**

మరణ, జనన సర్టిఫికెట్ల రికార్డులను నెలనెలా పంపిస్తున్నామన్న ఆస్పత్రి సిబ్బంది చెబుతుండగా.. 2023 ఫిబ్రవరి నెల వరకు సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రాల రికార్డులు మాత్రమే వచ్చాయని మున్సిపల్ అధికారులు తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రాలు 2023 అక్టోబర్ నెల వరకు వచ్చాయని పేర్కొన్నారు. ఈ లెక్కన మరణ ధ్రువీకరణ పత్రాలు ఏడాది, జనన ధ్రువీకరణ పత్రాలు సుమారు 4 నెలల పాటుగా పెండింగ్‌లో ఉన్నాయి. 2024 సంవత్సరానికి సంబంధించిన రికార్డులు ఇప్పటి వరకు ఒకటి కూడా పంపించకపోవడం గమనార్హం. ఈ నెలరోజుల వ్యవధిలో మరణించిన, జన్మించిన వారికి సంబంధించిన సర్టిఫికెట్లు జారీకావడం ఇబ్బందికరంగా మారింది. ఏడాది దాటితే ఈ సర్టిఫికెట్ల కోసం మళ్లీ ఆర్డీవో కార్యాలయం నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి.

### దృష్టికి వస్తే చర్యలు



మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించాల్సి ఉంటుంది. ఎలాంటి అడ్డంకులు ఉండవు. సిబ్బంది డేటా పంపించేందుకు ఇబ్బందులు పెడితే మా దృష్టికి తీసుకురావాలి. చర్యలు తీసుకుంటాం. మరణ, జనన ధ్రువీకరణ పత్రాల జారీలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

## ఆలోచన అదిరింది.. కోతి బెదిరింది



**ఇబ్రహీంపట్నం:** గ్రామాల్లో కోతులు ఇల్లుపీకి పందిరేస్తున్నాయి. పప్పులు, ఇతర దినుసులు దక్కనివ్వడం లేదు. ఏవైనా పప్పు దినుసులు ఆరబెడితే పొద్దంతా పెద్దకర్రతో కాపలా ఉండాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో మండలంలోని వేములకుర్తిలో కోతుల బెడద ఉండడంతో గ్రామానికి చెందిన అంకతి గౌరమ్మ ఒక అలోచన చేసింది. ఇంటి ఆవరణలో పల్లికాయ, పప్పుదినుసులు ఆరబెట్టి, పక్కనే ఓ సింహం బొమ్మను పెట్టింది. ఆ బొమ్మను చూసిన కోతులు బెదిరి పారిపోయాయి. ఆమె ఆలోచనను చూసిన స్థానికులు ప్రశంసించారు.

## పాపన్న ఆశయాలు కొనసాగించాలి

- విగ్రహావిష్కరణలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్



సర్దార్‌పాపన్న విగ్రహం ఆవిష్కరిస్తున్న విప్ అడ్లూరి

**ధర్మపురి:** బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలు కొనసాగించాలని ధర్మపురి శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురిలోని చింతామణి చెరువు కట్టపై గౌడసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్న విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కాంగ్రెస్ నాయకులు దినేశ్, వేముల రాజు, రాములుగౌడ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చెకుముకి సంబరాలు

**జగిత్యాలటౌన్:** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా జిల్లాస్థాయి టాలెంట్ పరీక్ష జగిత్యాల జిల్లాకేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కో– ఆర్డినేటర్ తులసి ఆగమయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలస్థాయిలో ఎంపిక కాబడిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

## ‘ఇళ్లలో పనులు.. బల్దియా జీతాలు’పై ఇంటెలిజెన్స్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

**మెట్‌పల్లి:** ప్రజాప్రతినిధులు, ఓ ఉన్నతాధికారి ఇళ్లలో పనిచేస్తున్న వారికి మున్సిపల్ నుంచి వేతనాలు చెల్లిస్తున్న వ్యవహారంపై శుక్రవారం ‘సాక్షి’లో ‘ఇళ్లలో పనులు.. బల్దియా జీతాలు’ అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. అయితే మెట్‌పల్లి మున్సిపల్‌లో వివాదంగా మారిన ఈ అంశంపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఉన్నతాధికారి ఎవరు, ఆ అధికారి ఇంట్లో ఎంత మంది పని చేస్తున్నారు, వారు పేర్లు తదితర వివరాలను మున్సిపల్ వర్గాల నుంచి సేకరించినట్లు తెలిసింది. అలాగే ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో పని చేస్తున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. మరోవైపు కొన్నేళ్ల నుంచి గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని బయటపెట్టిన కాంగ్రెస్ నాయకులు.. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది.

## ప్రశాంతంగా ప్రాక్టికల్స్

**జగిత్యాల:** జిల్లాలో రెండోరోజు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 92శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం జరిగిన జనరల్ విభాగంలో 775మందికి గాను 761మంది హాజరు కాగా, 14మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 724 మందికి 606 మంది హాజరు కాగా, 118 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్ విభాగంలో 342 మందికి 333 హాజరు కాగా, 9 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 814 మందికి గాను 730 హాజరు కాగా, 84 మంది గైర్హాజరయ్యారు. రెండోరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా నోడల్ అధికారి నారాయణ వివరించారు.

# నిరంకుశ పాలనను పాతిపెట్టారు



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

- ప్రజల తీర్పునకు మొన్నటి ఫలితాలే నిదర్శనం
- ధర్మపురిలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**ధర్మపురి:** నిరంకుశ పాలనను ప్రజలు పాతిపెట్టారు. అందుకు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ధర్మపురి లక్ష్మీనృసింహ స్వామిని శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఆయన అనంతరం బ్రాహ్మణ సంఘ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రజల్లో చాలా ఆశలు ఉండేవని, వాటిని గత ప్రభుత్వం తుంగలో తొక్కిందని అన్నారు. ధర్మపురి పుణ్యక్షేత్రం వేదాలకు నిలయమని, లక్ష్మీనృసింహస్వామి వారితో పాటు పవిత్ర గోదావరి ఉందని, ఇక్కడి ప్రజలు ఎంతో అదృష్టవంతులని కొనియాడారు. గతంలో ఇక్కడి ప్రాంతమంతా బొగ్గు గనులతో ఉండేదని గుర్తుచేశారు. గతంలో మాదిరిగానే సీఎస్ఆర్ నిధులు కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యా, వైద్యరంగానికి సీఎస్ఆర్ నిధులు వినియోగించేలా ముఖ్యమంత్రితో చర్చిస్తామని అన్నారు. ధర్మపురి కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకలుగా మార్చేందుకు, మార్చురీ ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు తప్పక అమలు చేస్తామని తెలిపారు. ఇప్పటికే రెండు హామీలు అమలు చేస్తున్నామని, మరో రెండింటిపై సమీక్షిస్తున్నట్లు వివరించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, త్వరలోనే తమ వాదనలు సుప్రీంకోర్టులో వినిపిస్తామని తెలిపారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎస్.దినేష్, వేముల రాజు, గడ్డం భాస్కర్‌రెడ్డి, సుముఖ్, సింహరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

- కలెక్టర్ యాస్మిన్ బాషా

**జగిత్యాల/జగిత్యాలరూరల్:** యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ప్రాథమికస్థాయిలోనే కట్టడి చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని యువత డ్రగ్స్ బారిన పడకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతీ పాఠశాల, కళాశాలలో యాంటీ డ్రగ్‌కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాల వాడకంపై ఉక్కుపాదం మోపాలని, తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని, గంజాయి సరఫరా చేసేవారిని, వినియోగించే వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలతో తయారుచేసిన చాక్లెట్స్ చిన్నారులు తినడం వంటి వార్తలు రావడం జరిగిందని, వాటిని పోలీసులు గుర్తించాలన్నారు. మానసిక నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు, పాఠశాల, కళాశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ.. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన ఆదిలాబాద్, నిర్మల్, ఉట్నూర్, ఇంద్రవెల్లి వంటి ప్రాంతాల నుంచి వచ్చే మత్తుపదార్థాలు రవాణా అయ్యే ఆస్కారం ఉందని సమాచారం వచ్చిందన్నారు. పోలీసు, ఎక్సైజ్, రవాణా, వ్యవసాయ, అటవీశాఖ సమన్వయంతో తనిఖీలు ముమ్మరం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ఆర్డీవోలు రాజేశ్వర్, మధు పాల్గొన్నారు.

**వ్యవసాయశాఖలో ఉద్యోగుల పాత్ర కీలకం**

వ్యవసాయ సాగుతో పాటు దిగుబడులు సాధించడంలో వ్యవసాయశాఖ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి సురేశ్ ఆధ్వర్యంలో ఏఈవోల జిల్లా అసోసియేషన్ డైరీని ఆవిష్కరించారు. రైతులకు సలహాలు, సూచనలు చేస్తూ దిగుబడిలో కీలకపాత్ర పోషించేది వ్యవసాయాధికారులన్నారు. ఏఈవోల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అయ్యోరి వినోద్, అధ్యక్షుడు సురేందర్‌నాయక్, కోశాధికారి భూమేశ్వర్, టీఎన్జీవో అధ్యక్షుడు బోగ శశిధర్, మిర్యాల రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణ**


ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. టీజీవో సంఘం జగిత్యాలశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కార్యదర్శి మామిడి రమేశ్, రవిబాబు, రాజేందర్‌రెడ్డి, విజేందర్, లావణ్య, ప్రవీణ్‌చంద్ర, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకేంద్రంలో ఇసుక స్టాక్ పాయింట్

**జగిత్యాలటౌన్:** అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు భవన నిర్మాణదారులపై పడుతున్న ఆర్థిక భారం తగ్గించేలా జిల్లాకేంద్రంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరగా.. స్పందించిన కలెక్టర్ స్టాక్ పాయింట్ ఏర్పాటుకు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పట్టణంలోని రాజరాజేశ్వర దేవస్థానం పరిసరాల్లో అందుబాటులో ఉన్న ఐదు ఎకరాల స్థలంలో ఇసుక స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. స్టాక్ పాయింట్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ‘నామినేటెడ్’పై ఆశలు

- కాంగ్రెస్‌లో ఆశావహుల సందడి
- పదేళ్లుగా పదవులకు దూరం
- పలు పోస్టుల భర్తీపై అధికార పార్టీ దృష్టి
- వివిధ సంస్థల చైర్మన్ల కోసం మొదలైన పైరవీలు



**గొల్లపల్లి:** పదేళ్లుగా అధికారానికి, పదవులకు దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడు అవకాశం వచ్చింది. జిల్లాలో ఆశించిన ఫలితాలు రాకున్నా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో స్థానిక నాయకుల్లో ‘నామినేటెడ్’ ఆశలు రేకెత్తుతున్నాయి. సీనియర్ నేతలకు ఎమ్మెల్సీ, పలు కార్పొరేషన్ల పదవులు మొదలుకుని, జిల్లాస్థాయి నేతలకు స్థానికంగా పలు సంస్థల చైర్మన్ పోస్టులు దక్కుతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించడంతో ఈ విషయమై జిల్లా నేతల్లో చర్చ ఊపందుకుంది. అధిష్ఠానం తమలో ఎవరికి ప్రాధాన్యం ఇస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

**పదేళ్ల తర్వాత అవకాశం**

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగింది. ఆ సమయంలో తెలంగాణ ఉద్యమం జోరందుకోవడంతో ఎమ్మెల్యేలు, వివిధ సంస్థల చైర్మన్ పదవుల్లో ఉన్నవారు చాలామంది రాజీనామాలు చేశారు. తమ పదవులను సద్వినియోగం చేసుకోలేకపోయామన్న ఆవేదన చాలామందిలో మిగిలిపోయింది. తర్వాత రాష్ట్రం ఏర్పడడం, వరుసగా 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపొందడంతో కాంగ్రెస్ నేతలకు అధికారిక పదవులు దూరమయ్యాయి. పదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకుంది. జిల్లాలోనూ పదేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. దశాబ్దం పాటు మూడు నియోజకవర్గాల్లో జగిత్యాల(2014లో కాంగ్రెస్) మినహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే అధికారంలో కొనసాగారు. ప్రస్తుతం ధర్మపురి మినహా జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. రాష్ట్రంలో అధికారంలోకి రావడం పార్టీశ్రేణులను సంతోషపెట్టింది. పదేళ్ల తర్వాత తమ పార్టీకి అధికారం దక్కడంతో తమకు న్యాయం జరుగుతుందని, వివిధ పదవులకు అవకాశం లభిస్తుందని కాంగ్రెస్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి సమన్యాయం చేసేలా పోస్టులు ఇవ్వాలంటున్నారు.

**పోస్టులపై లెక్కలు**

జిల్లాస్థాయిలో తమకు దక్కే అవకాశం ఉన్న పోస్టులను కాంగ్రెస్ నేతలు లెక్కేసుకుంటున్నారు. దాదాపు ఇప్పటికే ఆయా సంస్థల చైర్మన్లుగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు తప్పుకున్నారు. ఎవరు కూడా తమకు కేటాయించిన పదవుల్లో కొనసాగడం లేదు. జిల్లా గ్రంథాలయ సంస్థ, మార్కెట్ కమిటీలు, డీసీసీబీ, ప్రముఖ ధర్మపురి, కొండగట్టు వంటి పలు ఆలయాల ధర్మకర్త మండలి చైర్మన్లు, డైరెక్టరు పోస్టులకు ఆశావహుల తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది.

**ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని**

రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వివిధ సంస్థల చైర్మన్, డైరెక్టర్ పోస్టులను నియమించాలని కాంగ్రెస్ అగ్రనేతలు భావిస్తున్నట్లు తెలిసింది. అన్ని సామాజికవర్గాలకు ప్రాతినిథ్యం ఉండే విధంగా కమిటీలను కూర్పు చేయడానికి హస్తం పార్టీ కసరత్తు చేస్తోందని, పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన విధంగా గుర్తింపునిస్తామని, ఆ దిశగా రాష్ట్ర నాయకత్వం సంకేతాలు ఇస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో నామినేటెడ్ పదవులపై కొద్దిరోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

### అవకాశం దక్కేదెవరికో?

కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జిల్లా నుంచి సీనియర్లకు రాష్ట్రస్థాయి పోస్టులు కల్పించవచ్చన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ధర్మపురి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు, సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో ప్రభుత్వ విప్‌గా నియామకమయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్ష పదవితో పాటు మూడు నియోజకవర్గాల నుంచి పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు వివిధ సంస్థల చైర్మన్ పోస్టులను ఆశిస్తున్నారు.కాగా జిల్లాలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆశీస్సులున్న వారికే నామినేటెడ్ పోస్టులు దక్కే అవకాశం ఉంది. దీంతో కాంగ్రెస్ సీనియర్లు, జూనియర్లు వివిధ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు.

## క్లుప్తంగా

### సీసీఎల్ శిక్షణకు రాయికల్ ఉపాధ్యాయులు


అభయ్‌రాజ్


మహేశ్

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం రామారావుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్, భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మ్యాథ్స్ టీచర్ సిరిపురం మహేశ్ గుజరాత్‌లోని ఐఐటీ గాంధీనగర్‌లో సెంటర్ ఫర్ క్రియేటీవ్ లర్నింగ్ (సీసీఎల్) శిక్షణకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి అప్లికేషన్ ఒరియంటెడ్ అండ్ కాంటెక్స్ డ్రైవెన్ లర్నింగ్ అంశంపై నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.

### బట్టల దుకాణంలో అగ్ని ప్రమాదం



కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రంలోని సుమంగళి క్లాత్‌స్టోర్‌లో శుక్రవారం వేకువజామున అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వేకువజామున 5 గంటలకు యజమాని సంతోష్‌గౌడ్ దుకాణంలో మంటలను గమనించాడు. వెంటనే షట్టర్ ఓపెన్ చేసి చుట్టుపక్కలవారి సాయంతో మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల విలువైన బట్టలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

### నలుగురిపై వరకట్నం కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో నివాసం ఉంటున్న బత్తుల జ్యోతి ఉరఫ్ వంగల జ్యోతిని అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఘటనలో నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన జ్యోతి కుటుంబ సభ్యులు రాచర్ల బొప్పాపూర్‌లో నివాసం ఉంటున్నారు. జ్యోతిని పెర్కవేడుకు చెందిన వంగల సుమన్ 2023లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. మూడునెలల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. తర్వాత సుమన్‌తో పాటు మామ స్వామి, అత్త సుగుణ, బావ సునీల్ కలిసి రూ.10 లక్షల కట్నం తేవాలని జ్యోతిని శారీరకంగా, మానసికంగా వేధించడంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.



# చేపల పెంపకం.. ఉపాధి నమ్మకం

- మిడ్‌మానేరు నిర్వాసిత గ్రామాల్లో కేజ్‌కల్చర్‌తో ఉపాధి బాటలు
- మత్స్యకార్మికులకు అవకాశాలు సబ్సిడీ యూనిట్లు
- ఒక్కో యూనిట్ విలువ రూ.3 లక్షలు
- త్వరలోనే అవగాహన సదస్సులు


కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకం (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లోని మత్స్యకార్మికులకు ఉపాధి కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకంపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల రవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో మిడ్‌మానేరు నిర్వాసితుల ఉపాధి విషయాన్ని విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రస్తావించగా.. ఈమేరకు అధికారులను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లోనే అవగాహన సదస్సులు నిర్వహిస్తామని జిల్లామత్స్యశాఖాధికారి శివప్రసాద్ తెలిపారు.

**మిడ్‌మానేరులో 12 గ్రామాలు..**

మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో బోయినపల్లి, వేములవాడ, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని మత్స్యకార్మిక కుటుంబాలకు మాత్రమే కేజ్ కల్చర్ యూనిట్ వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టులు కలుపుకుని జిల్లాలో 440 వరకు చేపలు పెంచే చెరువులు ఉన్నాయి. 8,400 మత్స్యకార్మికులు, 135 సొసైటీలు ఉన్నాయి. ముంపు గ్రామాల్లో 1600 మంది లైసెన్స్ గల మత్స్యకార్మికులు ఉన్నారు.


కేజ్ కల్చర్‌లో పెరిగిన చేపలను బాక్స్‌ల్లో తరలింపు (ఫైల్)

**సబ్సిడీ రుణాలు**

మిడ్‌మానేరు ప్రాజెక్టు పునరావాసకాలనీల్లోని మత్స్యకార్మికులకు కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకానికి సబ్సిడీ రుణాలు అందించనున్నారు. నీటిలో కేజ్ కల్చర్ యూనిట్ నెలకొల్పడానికి ఒక్కో యూనిట్‌కు రూ.3 లక్షల రుణం అందిస్తారు. ఒక్కో మత్స్యకార్మికునికి ఒక్క యూనిట్ చొప్పున ఇవ్వనున్నారు. రూ.3 లక్షల రుణంలో జనరల్, బీసీ కేటగిరీల వారికి 40 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం వర్తిస్తుందని అధికారులు వివరించారు. త్వరలోనే మత్స్యకార్మికులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మత్స్యకార్మికశాఖ అధికారులు తెలిపారు.

**మత్స్యకార్మికులను ఆదుకోవాలి**



ముంపు గ్రామాల్లో మత్స్యకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇతరత్ర పనులు లేక చేపల పెంపకంపైనే అనేక కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. వారికి ఉపాధి కల్పించేందకు ప్రభుత్వం ప్రయత్నించడం మంచి పరిణామం. ముంపు గ్రామాల మత్స్యకార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలి. – మైలారం శ్రీనివాస్, కొదురుపాక

**త్వరలో అవగాహన సదస్సు**



మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకంపై ముంపు గ్రామాల మత్స్యకార్మికులతో త్వరలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తాం. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు తీసుకుని రావాలి. కేజ్ కల్చర్ యూనిట్లు మంజూరు చేయిస్తాం. – శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల

**మత్స్యకార్మికులు వినియోగించుకోవాలి**



మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లోని మత్స్యకార్మికులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంకంతో ఉపాధి కల్పించేందకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. యూనిట్ స్థాపనకు సబ్సిడీపై రుణం సైతం అందిస్తారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని ఆసక్తి గల మత్స్యకార్మికులు ఉపయోగించుకోవాలి. – మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

## 'ఉపాధి పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర'

కరీంనగర్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ కూలీలకు మరణశాసనం విధించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ప్రకటనలో ఆరోపించారు. ఉపాధి పథకానికి ఏటా బడ్జెట్‌లో కోత విధించినట్టుగానే ఈసారి కూడా కేటాయింపులు తక్కువ చేశారని అన్నారు. గతేడాది కంటే తక్కువ కేటాయించి, ఎక్కువ బడ్జెట్ కేటాయింపులు చేశామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్ల ఈ ఏడాది 1/3 వంతు ఉపాధి కూలీలు పనికి దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని, ఉపాధి పథకాన్ని ఎత్తివేయడానికి కుట్ర చేస్తోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల వేతనాలు పెంచాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ, విద్య, వైద్యం, ఉపాధి తదితర పథకాలకు బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించకుండా కార్పొరేట్ పక్షపాతినని నరేంద్రమోదీ మరోసారి రుజువు చేసుకున్నారని విమర్శించారు.

### కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్


వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత దృష్ట్యా తీసుకునే చర్యల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత దృష్ట్యా పిల్లలను స్కూళ్లకు చేరవేసే ప్రైవేటు బస్సులు, వ్యాన్‌లు, ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, ఇతర ధ్రువపత్రాలు తనిఖీ చేసి, డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇషాక్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు సబ్ జూనియర్ అథ్లెటిక్ జిల్లా జట్ల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సబ్ జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. అండర్– 8, 10, 12, 14 విభాగాల్లోని బాలబాలికలకు రన్నింగ్, జంపింగ్, త్రో అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు క్రీడాపాఠశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను ఈనెల 10న భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

### జేసీబీకి ఢీకొని వ్యక్తి దుర్మరణం


భూంరెడ్డి (ఫైల్)

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లి గ్రామంలో రోడ్డుపై నిలిపి ఉన్న జేసీబీని బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొని మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం దుండ్రపల్లి గ్రామానికి చెందిన కందుల భూంరెడ్డి (60) తన ద్విచక్ర వాహనంపై వట్టెంల నుంచి వేములవాడకు వస్తున్నాడు. శాత్రాజుపల్లి వద్ద రోడ్డుపై ఆగి ఉన్న జేసీబీని వెనక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

### ఉద్యోగంపై బెంగతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


సాగర్‌రెడ్డి (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ఉద్యోగంపై బెంగతో ఓ ఇంటర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లెకు చెందిన గూడ సాగర్‌రెడ్డి(18) శుక్రవారం గ్రామ శివారులోని పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు అతడి తల్లిదండ్రులు గూడ సంజీవ్‌రెడ్డి, రేణుకకు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి సాగర్‌రెడ్డి విగతజీవిగా మారాడు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సాగర్‌రెడ్డి ఇటీవల ఢిల్లీకి వెళ్లి కంప్యూటర్ కోర్సులో చేరాడు. తిరిగి ఢిల్లీకి వెళ్లే క్రమంలో ఉద్యోగం వస్తుందో రాదోననే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: స్థానిక కశ్మీర్‌గడ్డకు చెందిన ఖాసీం (55)పై జనవరి 30న ప్రమాదవశాత్తు శానిటైజర్ మీదపడగా, అప్పుడే బీడీ అంటించుకునే క్రమంలో నిప్పంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు షాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

### రోడ్డుప్రమాదంలో జేఎన్టీయూ విద్యార్థి మృతి


రవితేజ (ఫైల్)

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి రవితేజ గురువారం వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు రాసిన రవితేజ వారం రోజుల క్రితం వరంగల్ వెళ్లాడు. అక్కడ జరిగిన ప్రమాదంలో మృతిచెందడంతో కళాశాలలో విషాదఛాయలు నెలకొన్నాయి.

### రైలు నుంచి పడి ఒకరు..


గోపాల్‌ఛత్రియా(ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా భారుపల్లి గ్రామానికి చెందిన గోపాల్ ఛత్రియా (43) రాయపూర్ నుంచి సికింద్రాబాద్‌కు పాట్నా– సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తుండగా జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

### 8న బహిరంగ వేలం

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలకేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 8న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్ పేర్కొన్నారు. మార్చి 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముకునేందుకు హక్కు లైసెన్స్ రూ.500లతో పాటు రూ.2లక్షలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు హక్కు లైసెన్స్ రూ.300లతో పాటు రూ.1లక్ష చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు వాడుకలో ఉన్న బ్యాంకు చెక్కు, రూ.100 విలువ గల బాండ్‌పేపర్, ఆధార్‌కార్డు తీసుకు రావాలని తెలిపారు.

### దాడిచేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాలరూరల్: సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన చిరంజీవిపై దాడిచేసిన మహేశ్, అతడి తండ్రి రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు సారంగాపూర్ ఎస్సై తిరుపతి తెలిపారు. లక్ష్మీదేవిపల్లికి చెందిన మహేశ్ గురువారం తన భార్యను కొడుతుండగా అటుగా వెళ్తున్న చిరంజీవి చూశాడు. మహేశ్ భార్య రక్షించాలని అరవడంతో చిరంజీవి అడ్డుకున్నాడు. దీంతో మనసులో పెట్టుకున్న మహేశ్, అతని తండ్రి రాజేందర్ శుక్రవారం చిరంజీవిపై కర్రలతో దాడిచేశారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.


**రాజన్నా నమో నమః**

వేములవాడ: రాజన్నను శుక్రవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.





### ఆకట్టుకున్న ప్రదర్శనలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. త్యాగరాజ స్వామి జీవిత చరిత్ర, కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించారు. భక్తులు, స్థానికులు కళాప్రదర్శనలను వీక్షించారు.

## హౌసింగ్‌బోర్డు సొసైటీ స్థలాల పరిశీలన


బోర్డు తొలగిస్తున్న అధికారులు

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో సొసైటీ స్థలాలను తెలంగాణ హౌసింగ్‌బోర్డు సొసైటీ వరంగల్ డిప్యూటీ డీఈ రవిప్రసాద్, ఏఈ పృథ్వీరాజ్ శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ అధికారులు (లోకల్‌బాడీస్) కొంత స్థలం మున్సిపల్‌కు చెందిందని అందులో బోర్డు ఏర్పాటు చేయగా, సదరు స్థలం తెలంగాణ హౌసింగ్‌బోర్డు సొసైటీ పరిధిలోనే ఉందని గుర్తించిన మున్సిపల్ ఏర్పాటు చేసిన బోర్డును సొసైటీ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా సొసైటీ అధికారులు మాట్లాడుతూ, హౌసింగ్‌బోర్డు కాలనీలో 11.36 ఎకరాల స్థలంలో ఎంఐజీ–24, ఎల్ఐజీ–111, ఎల్ఐజీ2–38 ఇండ్ల నిర్మాణంతో కాలనీ రూపొందిందని వివరించారు. ఇందులో భాగంగా ఒక ఎకరం 6 గుంటల స్థలం సొసైటీ ఆధీనంలో ఉందని, హౌసింగ్‌బోర్డు కాలనీకి సంబంధించి ఇండ్లను అప్పటి గ్రామ పంచాయతీ(లోకల్ బాడీస్)కి అప్పగించినట్లు తెలిపారు. అవే కాకుండా హౌసింగ్‌బోర్డు కాలనీలో అక్కడక్కడా రోడ్డు, ఖాళీ స్థలాలు ఉన్నాయని, అవి కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత లోకల్‌బాడీస్ అధికారులపై ఉందన్నారు. సొసైటీ ఆధీనంలో ఉన్న స్థలాల వివరాలను తమ ఉన్నతాధికారులకు అందించి చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

## టీఎన్జీవో నాయకుడు సుధీర్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌అర్బన్: ఇటీవల గుండెపోటుతో మరణించిన టీఎన్జీవో నాయకుడు నూగూరి సుధీర్‌పటేల్‌కు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద సుధీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సుధీర్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. పెద్దపల్లిలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా, టీఎన్జీవోల సంఘంలో వివిధ హోదాల్లో, వివిధ జిల్లాల్లో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. టీఎన్జీవోల సంఘం కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, జిల్లా వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమల శారద, సబిత, టీజీవో నాయకులు మడిపల్లి కాళిచరణ్‌గౌడ్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మీందర్‌సింగ్, కార్యదర్శి సుమంతరావు, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి నేరెళ్ల కిషన్, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, నాయకులు బిక్షపతి, కొండయ్య, భూమయ్య, సేవియా నాయక్, మల్కా రాజేశ్వరరావు, ఆరవెల్లి రాజేశ్వరరావు, సబిత, హరిప్రియ, శైలజ, పద్మ, కామ సతీశ్, లవకుమార్, పవన్‌కుమార్, సత్యనారాయణ, బైరి శ్రీనివాస్, షేక్ అంజాద్, మన్మీత్‌సింగ్, ప్రణీత్‌కుమార్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, నారాయణ, అజయ్, కుమార్, రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ యజమానుల ఆందోళన


స్థానిక యజమానుల ఆందోళనతో నిలిచిపోయిన ట్రాక్టర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చేగుర్తిలో శుక్రవారం కరీంనగర్ ట్రాక్టర్లను స్థానిక ట్రాక్టర్ యజమానులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. మన ఇసుక–మన వాహనంలో చేగుర్తి, దుర్శేడ్‌కు చెందిన ట్రాక్టర్లకు మాత్రమే ఆన్‌లైన్‌లో బుకింగ్ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. చేగుర్తి ఇసుక క్వారీలో రెండు గ్రామాలకు చెందిన సుమారు 60 ట్రాక్టర్లకు మైనింగ్ అధికారులు అవకాశం కల్పించారు. అయితే కొత్తగా కరీంనగర్‌కు చెందిన 18 ట్రాక్టర్లకు అవకాశమివ్వగా శుక్రవారం చేగుర్తి క్వారీకి రావడంతో స్థానిక ట్రాక్టర్ యజమానులు అడ్డుకున్నారు. కరీంనగర్ ట్రాక్టర్లు క్వారీలోకి పోకుండా ఆందోళన చేయడంతో స్థానిక నాయకుడు ఒకరు క్వారీ గేటుకు తాళం వేయడంతో వివాదమేర్పడింది. రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను అడ్డుకున్న చేగుర్తికి చెందిన యజమానులను స్టేషన్‌కు తరలించారు. అయితే క్వారీ వివాదం తమకు ఎందుకన్నట్లుగా పోలీసులు ట్రాక్టర్ యజమానులను మైనింగ్ కార్యాలయానికి పంపించారు. ఈసందర్భంగా కరీంనగర్ ట్రాక్టర్లను తొలగించి స్థానిక ట్రాక్టర్లకు మాత్రమే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ మైనింగ్ అధికారులకు యజమానులు వినతిపత్రం సమర్పించారు.

## కాంగ్రెస్ ఎంపీ టికెట్‌కు దరఖాస్తులు


దరఖాస్తు చేస్తున్న రాజేందర్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కరీంనగర్ టికెట్ ఆశిస్తున్న నాయకులు దరఖాస్తు చేస్తున్నారు. పార్లమెంట్‌కు పోటీచేసే ఆశావహుల నుంచి కాంగ్రెస్ దరఖాస్తులు ఆహ్వానించడం తెలిసిందే. రూ.50 వేల రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మూడురోజుల క్రితం ప్రారంభమైనా, మొదట్లో కరీంనగర్‌కు దరఖాస్తులు రాలేదు. కానీ శుక్రవారం కరీంనగర్ టికెట్‌ను ఆశిస్తూ పలువురు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీనియర్ నేత, దివంగత వెలిచాల జగపతిరావు తనయుడు వెలిచాల రాజేందర్‌రావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ప్రస్తుతం యూఎస్ఏలో నివాసముంటున్న నగరంలోని వావిలాపల్లికి చెందిన సింగిరెడ్డి సుమనరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.